క్లుప్తంగా

అభినందనలు



మణికంఠను అభినందిస్తున్న అవంతి విద్యా సంస్థల చైర్మన్ శ్రీనివాసరావు, అధ్యాపకులు

భోగాపురం: మండంలోని చెరుకుపల్లి అవంతి కళాశాలలో చదువుతున్న సారిక మణికంఠ ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ వారు ఇటీవల నిర్వహించిన జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ 2025 చాంపియన్‌షిప్‌లో హైజంప్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించాడు. దీంతో విద్యార్థిని అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు గురువారం అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ. చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ చంద్రశేఖర్, చందర్రావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాధి నిరోధక టీకాలు



వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారి భాగ్యరేఖ

పూసపాటిరేగ: మండలంలోని వెంపడాం గ్రామంలో రెల్లివలస పీహెచ్‌సీ వైద్యాధికారి భాగ్యరేఖ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే అంటువ్యాధులు ప్రబలవన్నారు. అనంతరం పాఠశాలను సందర్శించి అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జి. బంగారుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



జేసీబీతో ఆక్రమణల తొలగింపు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. జిల్లా సర్వజన ఆస్పత్రి ప్రాంతంలో ఉన్న ఆక్రమణలు, తాత్కాలిక నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తొలగించారు. కొద్దిరోజుల కిందట ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి స్వచ్ఛందంగా తరలివెళ్లాలని సూచించినప్పటికీ కొంత మంది నిర్లక్ష్యంగా అక్కడే ఉంటూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. పోలీస్ బ్యారెక్స్ గేట్ నుంచి గ్యాస్ గొడౌన్ వరకున్న ఆక్రమణలను జేసీబీతో తొలగించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీప్లానర్ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వన్‌స్టాప్‌తో రక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సాయివిజయలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: ఆపదలో ఉన్న మహిళలకు వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించి రక్షణ పొందవచ్చని వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పి. సాయివిజయలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక స్కిల్ డవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో మహిళల రక్షణ చట్టాలపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. వన్‌స్టాప్ సెంటర్ ద్వారా మహిళలకు రక్షణ, సంరక్షణ, వైద్య, న్యాయ సహాయం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శోభారాణి, బ్యూలా రాణి, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి

- ఉద్యానవన శాఖాధికారి జ్యోత్స్నరాణి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖాధికారి జ్యోత్స్నరాణి

నెల్లిమర్ల రూరల్: ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని ఉద్యానవన శాఖాధికారి జ్యోత్స్నరాణి సూచించారు. మండలంలోని కొండవెలగాడలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ తోటలను పెంచేందుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. మొదటి నాలుగు సంవత్సరాల పాటు పంట సాగు నిర్వహణ నిమిత్తం ఒక హెక్టార్‌కు రూ.10,500 రాయితీ అందిస్తోందని.. అంతర్ పంటగా కోకో సాగు చేసుకోవడానికి హెక్టార్‌కు రూ.30 వేలు అందిస్తోందని చెప్పారు. అవసరమైన మొక్కలు కూడా ఉచితంగానే అందిస్తామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

- ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం



విజయనగరం కూడలి వద్ద మానవహారంగా ఏర్పడిన సిబ్బంది

విజయనగరం గంటస్తంభం: అటవీ సంపద, వన్య ప్రాణుల సంరక్షణ కోసం విధి నిర్వహణలో అశువులు బాసిన అటవీశాఖ అధికారులు, సిబ్బంది త్యాగాలు మరువలేమని డీఎఫ్ఓ ఆర్.కొండలరావు అన్నారు. గురువారం స్థానిక పూల్‌బాగ్ సమీపంలో ఉన్న అటవీశాఖ కార్యాలయంలో డీఎఫ్ఓ ఆధ్వర్యంలో 36వ రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత పూల్‌బాగ్ అటవీ కార్యాలయ ప్రాంగణం నుంచి విజయనగరం కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ కొండలరావు మాట్లాడుతూ.. ప్రతి ఏటా సెప్టెంబర్ 11న జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తుంటామన్నారు. రాజస్థాన్‌లోని ఖేజర్లీ గ్రామంలో 1730 సంవత్సరం సెప్టెంబర్ 11న చెట్లను రక్షించడానికి బిష్ణోయ్ సామాజిక వర్గం తమ ప్రాణాలను త్యాగం చేసిందన్నారు. వీరి త్యాగాలను స్మరించుకుంటూ ఏటా ఈ రోజున వారికి నివాళులర్పిస్తుంటామని చెప్పారు. కార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్ రామ్‌నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎఫ్ఓ కొండలరావు



అటవీ అధికారులు, సిబ్బంది ర్యాలీ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్



హాజరైన హెల్త్ సెక్రటరీలు

విజయనగరం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని హెల్త్ సెక్రటరీలకు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్పపీడన ప్రభావంతో వర్షాలు విస్తారంగా కురిసాయని, దీని ప్రభావం నవంబర్ వరకు ఉంటుందన్నారు. అంతవరకు కాలానుగుణ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో నగరంలో అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సచివాలయాల పరిధిలో ఫీవర్ సర్వేలు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా యాంటీ లార్వా ఆపరేషన్లను ముమ్మరం చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించే విధంగా ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాలని చెప్పారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, ఏఎస్ఓ రామకృష్ణ పాల్గొన్నారు.

సహకార చక్కెర ఫ్యాక్టరీలపై అసెంబ్లీలో ప్రస్తావించండి

- రాష్ట్ర చక్కెర శాఖ కమిషనర్ వి.వెంకటరావును కోరిన భీశెట్టి



రాష్ట్ర చక్కెరశాఖ కమిషనర్‌కి వినతిపత్రం అందజేస్తున్న భీశెట్టి

విజయనగరం గంటస్తంభం: ఆంధ్రప్రదేశ్‌లో మూలకు చేరిన తాండవ, ఏటికొప్పాక, అనకాపల్లి, భీమసింగి సహకార చక్కెర కర్మాగారాలపై ఈ నెల 18వ తేదీ నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని రాష్ట్ర చక్కెర శాఖ కమిషనర్ వి.వెంకటరావును లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. వెలగపూడిలోని కమిషనర్‌తో గురువారం సమావేశమై ఉత్తరాంధ్రలోని చెరుకు రైతులు, కార్మికులు, ఉద్యోగుల ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చక్కెర ఫ్యాక్టరీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. మూతబడిన సుగర్ ఫ్యాక్టరీల ఉద్యోగులు, కార్మికుల పీఎఫ్, గ్రాట్యుటీ ప్రభుత్వం చెల్లించకపోవడంతో చాలామంది కార్మికులు ఆవేదనతో మరణించారని, రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. చక్కెర ఫ్యాక్టరీల పరిధిలోని ఎమ్మెల్యేలు, జిల్లాలోని మంత్రులు, ఎంపీలు కనీసం నోరు మెదపకపోవడం బాధాకరమని చెప్పారు. ప్రజలు అధికారం ఇస్తే ఫ్యాక్టరీలను తెరిపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, యువగళం పాదయాత్రలో లోకేష్ ఎన్నికల ముందు హామీ ఇచ్చారని భీశెట్టి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఒత్తిడి తగ్గించాలి



కమిషనర్ జయరామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

నెల్లిమర్ల: రోజురోజుకీ పనిభారం పెరుగుతోందని, వెంటనే ఒత్తిడి తగ్గించాలని నెల్లిమర్ల నగర పంచాయతీకి చెందిన సచివాలయ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు కమిషనర్ జయరామ్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన జాబ్‌చార్ట్ కంటే అదనంగా పనులు అప్పగిస్తున్నారన్నారు. ముఖ్యంగా సర్వేలతో తాము సతమతమవుతున్నట్లు వాపోయారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొబ్బరి నీళ్లలో ఫంగస్



కొబ్బరి నీళ్లలో వచ్చిన ఫంగస్



అపాలో మెడికల్ షాపులో కొనుగోలు చేసిన కొబ్బరినీళ్ల బాటిల్

విజయనగరం ఫోర్ట్: కొబ్బరి నీళ్లలో ఫంగస్ వచ్చిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన గణేష్ అనే వ్యక్తి ఉడా కాలనీలో ఉన్న అపాలో ఫార్మసీలో కోకోనట్ వాటర్ బాటిల్ (కొబ్బరినీళ్లు) కొనుగోలు చేశారు. వెంటనే మూత తీసి చూడగా అందులో ఫంగస్ ఉంది. దీంతో గణేష్ ఔషధ నియంత్రణశాఖ సహాయ సంచాలకులు డి.రజితకు ఫిర్యాదు చేశారు. అయితే కొబ్బరి నీళ్లు తన పరిధిలోకి రాదని, ఫుడ్ కంట్రోల్ పరిధిలోకి వస్తుందని చెప్పడంతో ఫుడ్ కంట్రోల్ అధికారి ఈశ్వరికి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని సాక్షి ఆమె వద్ద ప్రస్తావించగా.. బాధితుడి ఫిర్యాదు మేరకు అపాలో షాపులో విచారణ చేపట్టేందుకు ఇన్‌స్పెక్టర్‌ను పంపించామన్నారు. శాంపిల్ తీయడానికి నాలుగు లీటర్లు ఉండాలని.. షాపు వద్ద ఒకే బాటిల్ ఉండడంతో ఇకపై ఇటువంటి విక్రయాలు చెయ్యవద్దని హెచ్చరించామని తెలిపారు.

డ్రోన్ వినియోగం మేలు



డ్రోన్ పిచికారీపై అవగాహన కల్పిస్తున్న ఏఓ నీలిమ, తదితరులు

పూసపాటిరేగ: వరి సాగుకు సంబంధించి డ్రోన్ సహాయంతో సస్యరక్షణ చేపట్టడం వల్ల సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందని మండల వ్యవసాయాధికారి కె. నీలిమ, ప్రకృతి వ్యవసాయం అడిషనల్ డీపీఎం స్వామినాయుడు అన్నారు. మండలంలోని ఎరుకొండలో డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీ చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా తయారు చేసుకున్న కషాయాలను డ్రోన్ సహాయంతో పిచికారీ చేసుకోవాలని సూచించారు. చీడపీడల నివారణకు కషాయాలు ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో పాటు ఆదర్శ రైతులు అప్పలరాజు, జ్యోతి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానవనశాఖ అధికారి చంద్రశేఖర్

గజపతినగరం: రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన వనశాఖ అధికారి చంద్రశేఖర్ అన్నారు.మండలంలోని లోగిశ గ్రామ రైతు సేవా కేంద్రంలో రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయిల్ పామ్‌సాగుపై అవగాహన కల్పించడం తో పాటు, పంట సాగుకు ఉద్యానవన శాఖ అందించే ప్రోత్సాహకాల గురించి వివరించారు. ఈ పంట సాగుకు తక్కువ పెట్టుబడి, తక్కువ నీటి తడులు సరిపోతాయని చెప్పారు. మొక్కలు నాటిన అయిదేళ్ల తర్వాత పంట చేతికి వస్తుందని, అప్పటి వరకు అంతర పంటలు సాగు చేసుకుని ఆదాయం పొందవచ్చని అన్నారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ గింజలకు మంచి ధర ఉందని వివరించారు. ఉద్యానవనశాఖ సిబ్బంది దీప్తి, వీఏఏలు రోజా, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నెల్లిమర్ల: విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలని ఆ ఉద్యోగుల సంఘ రాష్ట్ర జేఏసీ సభ్యులు ఆరికతోట రామకృష్ణ, లెంక సంతోష్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండల విద్యాశాఖ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, భవిత కేంద్రాలు, కేజీబీవీలలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వీరంతా సకాలంలో జీతాలందక అవస్థలు పడుతున్నారని.. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

జిల్లాకు చేరుకున్న యాత్రికులు

విజయనగరం క్రైమ్: నేపాల్‌లో చిక్కుకున్న జిల్లాకు చెందిన యాత్రికులు గురువారం క్షేమంగా ఇంటికి చేరుకున్నారు. జిల్లాకు చెందిన అవనాపు శ్యామలరావు, ఎల్. మురళీకృష్ణ, ఎల్. శారద, బి.కామేశ్వరరావు, మాలతి, మురళి, రేణుక, మహాపాత్రో శివప్రసాద్, ప్రదీప్, సుబ్బారావు, శ్రీనివాసరావు, మల్లరాజు, సత్యనారాయణ, పద్మ, రమణ, రమ, ఆర్ఎస్ రావు, దేవి, డీఎస్ రావు, రాధ, లక్ష్మి, పత్తిగిల్లి సూర్యకుమారి, లలిత, బంగార్రాజు, సూర్యకళ, ఈశ్వర్, కేఎల్ రావు, రామయ్యమ్మ, ఆర్‌జీ రెడ్డి, కేఎస్ రావు, కె.సత్యనారాయణ, జి.సత్యనారాయణ, రాజు, శేఖర్, తదితరులు నేపాల్ వెళ్లారు. అక్కడ జరిగిన అల్లర్లలో చిక్కుకున్న వీరంతా కేంద్ర ప్రభుత్వ చర్యలతో విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ నుంచి విజయనగరం వచ్చారు. ఇదిలా ఉంటే విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, తదితరులు విశాఖ విమానాశ్రయంలో యాత్రికులను పరామర్శించారు.

లెండి విద్యార్థుల ప్రతిభ



లెండి విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

డెంకాడ: జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు హ్యాకథాన్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. విశాఖలోని గాయత్రీ విద్యాపరిషత్‌లో గురువారం జరిగిన అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకథాన్ పోటీల్లో నార్త్‌కోస్టల్ రీజనల్‌లో కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ఇంజినీరింగ్ విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించేందుకు హ్యాకథాన్ పోటీలు నిర్వహించగా.. వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 35 విద్యార్థి బృందాలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. వీటిలో లెండి కళాశాల నుంచి డీన్ వసంత, సంగీత మెంటార్‌షిప్‌లో రెండు బృందాలు పాల్గొన్నాయి. జి.శైలజ నాయకత్వంలో సిమ్యులేటర్ రూపొందించగా.. ప్రథమ బహుమతి లభించింది. బి.అప్పలరాజు నాయకత్వంలో క్వాంటం మిషన్ లెర్నింగ్ ఫ్రేమ్ వర్క్ రూపొందించగా ద్వితీయ బహుమతి వచ్చింది. దీంతోవీరికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు, వి.అంజిరెడ్డి, విభాగాధిపతి ఎ.రామారావు, అధ్యాపకులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

డెంకాడ: మండలంలోని చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఉన్న ఎస్‌పీఎస్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ మలికాగార్గ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాల స్థాయిలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు హిందీ, గణితం పోస్టులకు ఇంటర్, బీఏ, బీఎస్సీతో పాటు డీఈడీ, బీఈడీ చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు బీఏ, బీఎస్సీతో పాటు బీఈడీ, ఎంఈడీ అర్హత కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 94409 06345, 73822 34573 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ లావణ్య

- సీడీపీఓ లావణ్య

భోగాపురం: బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ లావణ్య కోరారు. బాల్య వివాహాల నిర్మూలన, లింగ వివక్షత, రక్తహీనత, ఆడ పిల్లలపై అత్యాచారాల నిరోధం, బాలికల అక్రమ రవాణా, తదితర అంశాలపై స్థానిక కొమ్మూరు అప్పడుదొర మెమోరియల్ కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాలికలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఉమెన్ హెల్ప్ లైన్ నంబర్ 181కు గాని లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ శివశంకర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు హేమ, శ్రీదేవి, కార్యకర్తలు టి. రమణమ్మ, కె. అనురాధ, తులసి, వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి



రవితేజను సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, తదితరులు

విజయనగరం అర్బన్: కంప్యూటర్ పరిజ్ఞానం, లాంగ్వేజెస్‌పై పట్టు పెంచుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయిన గీతం యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గేదల రవితేజ అన్నారు. సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థుల ఇంట్రడక్షన్ కార్యక్రమంలో భాగంలో 'స్పీకింగ్ ది లాంగ్వేజ్ ఆఫ్ కంప్యూటర్స్ - ప్రొగ్రామింగ్ లాంగ్వేజెస్' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన రిసోర్స్‌పర్సన్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రొగ్రామింగ్ భాషల పరిణామం, సమస్యల పరిష్కారంలో వాటి పాత్రపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన్ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ప్రాణాలు నిలిపిన ఘోషాస్పత్రి వైద్యులు



ఘోషాస్పత్రిలో గౌరీశ్వరిని పరామర్శిస్తున్న సూపరింటెండెంట్ పద్మజ, డిప్యూటీ సూపరింటెండెంట్, తదితరులు

విజయనగరం ఫోర్ట్: సకాలంలో చికిత్స అందించి ఘోషాస్పత్రి వైద్యులు తల్లీబిడ్డల ప్రాణాలు నిలిపారు. రామభద్రపురం మండలానికి చెందిన బి. గౌరీశ్వరి ప్రసవం కోసం బాడంగి సామాజిక ఆస్పత్రికి ఈ నెల 8వ తేదీ ఉదయం పదిన్నర గంటలకు వెళ్లింది. తొలి కాన్పులో ఆమెకు సిజేరియన్ అవ్వడంతో రెండో కాన్పులో కూడ సిజేరియన్ చేయడానికి ఆస్పత్రి వైద్యులు మత్తు ఇచ్చారు. అయితే మత్తు ఇచ్చిన వెంటనే గౌరీశ్వరి కాళ్లు చేతులు బిగుసుకుపోవడంతో పాటు హైబీపీ రావడంతో వెంటనే వైద్యసిబ్బంది అంబులెన్స్‌లో ఆమెను ఘోషాస్పత్రికి తరలించారు. అప్పటికే రోగి పరిస్థితి విషయంగా ఉండడంతో ఘోషాస్పత్రి వైద్యులు వెంటిలేటర్‌పై ఉంచి అత్యవసర వైద్యం అందించి సిజేరియన్ చేసి తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడారు. క్లిష్టమైన శస్త్రచికిత్స చేసిన వైద్యులు అరుణశుభశ్రీ, జయధీర్‌బాబు, దీపక్‌లను ఆస్పత్రి సూపరింటెండెంట్ అల్లు పద్మజ అభినందించారు.

బురదలో కూరుకుపోయిన 108 వాహనం

దత్తిరాజేరు: మండలంలోని గొభ్యాం కూడలి వద్ద బీటీ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోత బారడంతో తాత్కాలికంగా మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు. ఈరోడ్డులో గురువారం సాయంత్రం 108 వాహనం కూరుకుపోవడంతో దానిని బయటకు తీసేందుకు సిబ్బంది నానా అవస్థలు పడ్డారు. 108 డ్రైవర్ వాహనాన్ని బయటకు తీసేందుకు శ్రమించినప్పటికీ ఫలితం లేకుండాపోవడంతో ట్రాక్టర్ సహాయంతో బయటికి తీశారు. అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్డుకు త్వరగా మరమ్మతులు చేపడితే ఇలాంటి ఇబ్బందులు ఉండవని ఆ మార్గంలో ప్రయాణించే వారు అంటున్నారు.



బురదలో కూరుకుపోయిన 108 వాహనం